క్లుప్తంగా

యాంటీబయాటిక్స్‌పై అవగాహన

ఆత్మకూరు : యాంటీబయాటిక్స్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ స్పందన అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం యాంటీ మైక్రోబియల్ నిరోధకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ ప్రధాన్ సూచించిన విధంగా యాంటిబయాటిక్స్ ఉపయోగించాలన్నారు. అనంతరం వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ పుష్పలీల, డాక్టర్ చైతన్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ యూత్ కమిటీ ఎన్నిక



ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ యూత్ కమిటీని మండల అధ్యక్షుడు చింత అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా అంబాల వంశీ, కార్యదర్శిగా తాటికాయల రవి, ఉపాధ్యక్షుడిగా ఆకులపల్లి కార్తీక్, సహాయ కార్యదర్శిగా బరిగల తరుణ్, ముఖ్య సలహాదారులుగా బరిగల రమేశ్, గడ్డం సారయ్య, కార్యవర్గ సభ్యులుగా మహేందర్, చింటూ, రాకేష్, కుమార్, నితిన్, అరవింద, అశోక్, ఏలెందర్, మధు, అజయ్, సూర్యతేజ, అనిల్, సునీల్‌ను ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడు ఆరోగ్యం, కార్యదర్శి ఏలియా పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో గల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దామెర అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయ సమైక్యతకు పాటుపడాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న బొడ్డు ప్రత్యూష, బొడ్డు జానీ తండ్రి బొడ్డు వినోద్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, అధ్యాపకులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించి, రూ.5వేలు నగదును అందించారు. అధ్యాపకులు షేక్ ఆజం, బాబురావు, రాములు, వెంకట్, సదానందం, గణేశ్, రాజేందర్, గోపాలకృష్ణ, ప్రభాకర్, మంజుల, రవి పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



ఐనవోలు : మండలంలోని వెంకటాపురంలో శ్రీ షిరిడిసాయి పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన రాయినేని ప్రభాకర్ ఇటీవల మృతిచెందాడు. అయితే ప్రభాకర్ సంఘంలో సభ్యుడు అవడంతో వారి కుటుంబ సభ్యులైన నామినీకి మంగళవారం రూ.70 వేల బీమా సొమ్ము అందించారు. అధ్యక్షుడు కాత వీరస్వామి, పాలకవర్గం, గణకులు పాల్గొన్నారు.

పల్టీ కొట్టిన కారు

ఒకరికి గాయాలు



నడికూడ : అదుపుతప్పి కారు పల్టీ కొట్టింది. ఈ సంఘటన మండలం కేంద్రం శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మహ్మద్ షా నాల్లమాటు వాగు బ్రిడ్జి వద్ద పరకాల నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలైనట్లు తెలిసింది. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. పరకాల ఎస్సై శివకృష్ణను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

రాత్రి ఎనిమిది దాటితే ఇబ్బందులే..

- పరకాల డిపోలో బస్సుల కొరత
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- హనుమకొండ, భూపాలపల్లి డిపోల బస్సులే ఆధారం
- అధికారులు పట్టించుకోవాలని ప్రయాణికుల విజ్ఞప్తి



పరకాల బస్టాండ్‌లో రాత్రి సమయంలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

పరకాల : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, హనుమకొండ ఆర్టీసీ డిపోల తర్వాత ఆదాయం తీసుకొచ్చే పరకాల డిపోకు బస్సుల కొరత వెంటాడుతోంది. ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడంలో వెనుకంజలో ఉందనే విమర్శలు వస్తున్నాయి. రాత్రి 8 గంటలు దాటితే పరకాల బస్టాండ్‌లో బస్సుల కొరత ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఆదాయంపై ఉన్న చిత్తశుద్ధి బస్సు సర్వీస్‌లను పెంచి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చడంలో లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా ప్రస్తుతం 75 సర్వీస్‌లను పగలు నడుపడటమే సవాలుగా మారగా.. నిజామాబాద్, హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు 20 బస్సులకుపైగా నడుస్తుండగా మిగతా సర్వీస్‌లను భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, కాళేశ్వరంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు నడుపుతున్నారు. ఒక్కో సర్వీస్‌లో సీట్ల కంటే అదనంగా 20 నుంచి 30 మందిని తరలిస్తున్నారు. దీంతో భూపాలపల్లి నుంచి హనుమకొండకు తిరుగుతున్న బస్సులపై ఆధారపడుతున్నపటికీ రాత్రి వేళలో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్నారు. చాలా కాలంగా సమస్యను ఎదుర్కొంటున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. ఆర్టీసీకి ఆదాయం తేవడంలో పేరున్న పరకాల డిపోకు మరిన్ని బస్సులు కేటాయించాలని కోరుతున్నారు.



సెమి డీలక్స్ రాగానే ఎగబడుతున్న ప్రయాణికులు

రాత్రిపూట బస్సు నడిపించాలి



పరకాల బస్టాండ్ నుంచి రాత్రి వేళలో బస్సులు సరిగా ఉండటం లేదు. రాత్రి 8 దాటితే బస్సుల కొరత కనిపిస్తోంది. ఒక్క బస్సు కోసం గంట సేపు వేచిచూడాల్సి వస్తోంది. మంది లేకపోతే బస్సులు నడుపలేమనట్లు ఆర్టీసీ అధికారులు వ్యవహరించడం సరికాదు. సంబంధిత అధికారులు స్పందించి రాత్రి సమయంలో ప్రయాణించే వారి సమస్యలను పరిష్కరించాలి.

– మడికొండ జేమ్స్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, పరకాల

లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ



కక్కిరాలపల్లిలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

సాక్షి ఎఫెక్ట్..

ఐనవోలు : మండలంలోని 13 రేషన్ షాపులకు నవంబర్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం అందకపోవడంతో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ కాలేదు. దీంతో ఈనెల 18 వ తేదీన 'గడువు ముగిసినా రేషన్ బియ్యం ఇవ్వరా?' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మంగళవారం మధ్యాహ్నం వరకు 13 షాపులకు రేషన్ బియ్యం చేరవేసి హడావుడిగా రేషన్ డీలర్లతో పంపిణీని ప్రారంభింపజేశారు. దీంతో సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

తరలిన కాంగ్రెస్ శ్రేణులు

పరకాల : వరంగల్ నగరంలో మంగళవారం సీఎం పర్యటనకు పరకాల మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లాడు.

దామెరలో..



దామెర : హనుమకొండ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభకు మండలం నుంచి మహిళా సంఘాల సభ్యులు భారీగా తరలివెళ్లారు. మండల వ్యాప్తంగా 5 బస్సుల్లో సుమారు 300 మంది మహిళా సంఘాలు సభ్యులు వెళ్లారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



శాయంపేట : ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తి : ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కమలాపూర్ : ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, బాసాని శాంత, మారపల్లి కట్టయ్య, మార్కండేయ, రాజేందర్, వరదరాజు, శంకరాచారి, నరేష్‌రెడ్డి రాజు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు సంతాజీ, రాజేశ్వర్‌రావు, అనీల్‌కుమార్, వెంకటేష్, మహేందర్, వెంకటరమణ, సురేందర్, రాజయ్యగౌడ్, రమేశ్, సూరయ్య పాల్గొన్నారు.

కమలాపూర్ : స్వర్గీయ భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకుడు రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఐలయ్య, డైరెక్టర్ కృష్ణమూర్తి, శివకృష్ణ, నాయకులు భిక్షపతి, విజయ, పరశురాములు, శ్రీకాంత్, భిక్షపతి, సుభాష్, సునీల్, రామస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



కమలాపూర్ : పోలీసుల అదుపులో దళితబంధు సాధన సమితి నాయకులు



దామెర : పోలీస్ స్టేషన్‌లో గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసితులు



ఐనవోలు : బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులను అరెస్టు చేసిన పోలీస్‌లు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్ట్‌లు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో మంగళవారం ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలు, ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాల్లో భాగంగా సీఎం, మంత్రులు హాజరు కానున్నండగా అర్ధరాత్రి 2 గంటలకు పోలీసులు తనను అరెస్ట్ చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. విద్యార్థి సంఘాల నాయకులను, ఉద్యమకారులను అరెస్టులు చేసి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే గుణపాఠం తప్పదన్నారు.

దామెర : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఎక్స్‌ప్రెస్ హైవే గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసితులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. మండంలోని ఊరుగొండ, పసరగొండ గ్రామాలకు చెందిన బొల్లు సమ్మిరెడ్డి, సూర్యం, రఘు, కుమారస్వామిని అరెస్ట్ చేసి అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

ఐనవోలులో..

ఐనవోలు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మంగళవారం ఉదయం పలువురు ఎమ్మార్పీఎస్, బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. అరెస్టైన వారిలో మాజీ సర్పంచ్‌లు ఉస్మాన్ అలీ, బరిగెల సదానందం, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు బొక్కల నారాయణ, బరిగెల వెంకటస్వామి, బీఆర్ఎస్ నాయకుడు గుంశావలీ ఉన్నారు.

హేయమైన చర్య

వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు సీఎం రేవంత్‌రెడ్డి, వివిధ శాఖల మంత్రులు హాజరు కానున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులను పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఆ సంఘం నాయకులు బొక్కల నారాయణ, బరిగెల వెంకటస్వామిలు అన్నారు. అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదన్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. శ్రీనివాస్, బరిగెల ఏలియా, ఇసురం బాబు, జలగం ఎల్లకుమార్, ఇసురం సుదర్శన్ నిరసన తెలిపిన వారిలో ఉన్నారు.

పరకాలలో..

పరకాల : వరంగల్ నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు జాగ్రత్త పడ్డారు. పరకాల మండలంలో ప్రతిపక్షాల నాయకులతో పాటు బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను, యువజన, విద్యార్థి సంఘాల నాయకులను, గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులను అరెస్టు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పరకాల : అరెస్టైన బీఆర్ఎస్, విద్యార్థి సంఘాల నాయకులు

కమలాపూర్‌లో..

కమలాపూర్ : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండలానికి చెందిన పుల్ల శ్రీనివాస్, మాట్ల దినేష్, పుల్ల పున్నంచందర్, మాట్ల రాజు అనే నలుగురు దళితబంధు సాధన సమితి నాయకులను మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. సాయంత్రం వారందరిని సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసంలో ఆత్మకూరు, దామెర మండలాల సమన్వయ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని సూచించారు. కాంగ్రెస్ నియంతృత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అబద్ధాల హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, బొల్లెబోయిన రవియాదవ్, సావురే రాజేశ్వర్‌రావు, కాంతాల కేశవరెడ్డి, దుంపల బుచ్చిరెడ్డి, గండు రాము, ముదిగొండ కృష్ణమూర్తి, ఎండి.జాకీర్‌అలీ, పోలం కృపాకర్‌రెడ్డి, దాడి మల్లయ్య, కృష్ణమూర్తి, పున్నం సంపత్, బొల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత ఆలోచనలో మార్పు రావాలి

- ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య



నేషనల్ ఎంట్రప్రెన్యూర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పరకాల : యువత ఆలోచన విధానంలో మార్పు రావాలని, ఉద్యోగ అన్వేషణలో సమయం వృధా చేయకుండా నలుగురికి ఉపాధి కల్పించే చిన్నచిన్న సంస్థలను నెలకొల్పాలని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నేషనల్ ఎంట్రప్రెన్యూర్స్‌డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. నేటి యువత చేతుల్లోనే దేశాభివృద్ధి ఉందన్న విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఉత్తమమైన ఆలోచన విధానంతో దేశానికి ఉపయోగపడే అవసరాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం హెడ్ బల్గూరి మహేందర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ గూడూరి పావని, కళాశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశోక్ మోరె పాల్గొన్నారు.

బస్సుల కొరత.. ప్రయాణికుల ఇక్కట్లు



బస్ షెల్టర్ వద్ద బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



బస్సులు రాకపోవడంతో ఆటోలో ఎక్కుతున్న ప్రయాణికులు

శాయంపేట : వరంగల్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి, ప్రజాపాలన విజయోత్సవ సంబురాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను డ్వాక్రా మహిళలను తరలించేందుకు కేటాయించారు. దీంతో మంగళవారం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం వేచిచూస్తూ ఇక్కట్లు పడ్డారు. పరకాల–హనుమకొండ ప్రధాన రహదారిలోని మాందారిపేట స్టేజీ వద్ద ఉదయం నాలుగు గంటల నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు విద్యార్థులు బస్సు కోసం వేచి చూస్తూ ఎట్టకేలకు 5.45 గంటలకు ఒక బస్సు రాగా అందులో ప్రయాణికులు రద్దీగా ఉన్నప్పటికీ ఇక్కట్లు పడుతూ ప్రయాణం కొనసాగించారు. బస్ షెల్టర్ వద్ద బస్సుల కోసం వేచి చూసిన ప్రయాణికులు.. విసుగుచెంది చివరికి ఆటోలు, టాటామ్యాజిక్ ఇతర వాహనాల్లో ప్రయాణించి గమ్యానికి చేరుకున్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

ఎల్కతుర్తి : డిసెంబర్ 10 నుంచి 26 వ తేదీ వరకు జరిగే సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో కౌన్సిల్ సమావేశం గడ్డం రాజనర్సు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని సూరారం శివారులో గుడిసెలు వేసి భూ పోరాటాన్ని ఉధృతం చేయాలన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాములు, వెంకటరమణ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, మనోహర్, లలిత, తిరుమల, పోచయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి



మాట్లాడుతున్న తిరుపతి

శాయంపేట : ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి డిమాండ్ చేశారు. మండలంలోని ప్రగతి సింగారంలో మంగళవారం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం అవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆరోపించారు. హామీలు అమలు చేసే వరకు సీపీఎం పోరాటం చేస్తుందని అన్నారు. అనంతరం సీపీఎం శాయంపేట, ప్రగతి సింగారం శాఖ కార్యదర్శిగా మాజీ సర్పంచ్ చిలకల కొమురయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా వెల్లడించారు. కమిటీ సభ్యులుగా మాదాసు తిరుపతి, బల్ల రవి, కొమురయ్య, ఎల్లయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుడెప్పాడ్ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇప్ప రాజు గుడెప్పాడ్ నుంచి ఆత్మకూరుకు కాలినడకన వస్తున్నాడు. ఈ క్రమంలో అతడి వెనుక నుంచి వచ్చిన కోళ్ల తరలిస్తున్న వాహనం ఢీ కొట్టింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

నేడు ఉచిత పైల్స్ శిబిరం

కాశిబుగ్గ : వరంగల్ బస్టాండ్ సమీపంలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో బుధవారం ఉచిత పైల్స్, ఫిస్టులా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మంగళవారం శల్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.